రైలు పట్టాలపై యువకుడి ఆత్మహత్య

తాడేపల్లి రూరల్ : మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని విజయవాడ చెన్నై రైలు మార్గంలో కొలనుకొండ వద్ద ఆదివారం గుర్తు తెలియని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే హెడ్ కానిస్టేబుల్ రవికిశోర్ తెలిపిన వివరాల ప్రకారం... కొలనుకొండ బ్రిడ్జి సమీపంలో తెలుపురంగు బనియన్ లాంటి టీషర్ట్, బూడిద కలర్ జీన్స్ ఫ్యాంట్ ధరించిన యువకుడు విజయవాడ చెన్నై రైలు మార్గంలో రైలు పట్టాలపై తలపెట్టి ఆత్మహత్య చేసుకున్నాడు. గుర్తుపట్టడానికి వీల్లేకుండా మృతదేహం ఉంది. వివరాలకు తెనాలి రైల్వే పోలీసులను సంప్రదించాలని హెడ్ కానిస్టేబుల్ రవికిశోర్ సూచించారు.







వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ కార్యకర్తలు

సాదరంగా ఆహ్వానించిన సమన్వయకర్త గంజి చిరంజీవి

తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని నులకపేటకు చెందిన పలువురు బీసీలు తెలుగుదేశం పార్టీని వీడి ఆదివారం వైఎస్సార్ సీపీలో చేరారు. మంగళగిరి వైఎస్సార్ సీపీ ఇన్చార్జి గంజి చిరంజీవి, మంగళగిరి వైఎస్సార్ సీపీ రూరల్ అధ్యక్షుడు మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో గౌడ సంఘం నాయకులతో కలసి 20 కుటుంబాలు పార్టీలో చేరాయి. గంజి చిరంజీవి కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్. జగన్మోహన్‌రెడ్డి బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు ప్రాధాన్యత కల్పించి పరిపాలనతో సైతం వారికి మంచి అవకాశాలు కల్పిస్తున్నారని తెలిపారు.


చిరంజీవి ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ కార్యకర్తలు

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

తాడేపల్లి రూరల్ : దుగ్గిరాల మండల పరిధిలోని చిలువూరుకు చెందిన దేశమాల సుదర్శనరావు అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన కుటుంబాన్ని మంగళగిరి నియోజకవర్గ ఇన్చార్జి గంజి చిరంజీవి ఆదివారం పరామర్శించి అంత్యక్రియల నిమిత్తం ఆర్థిక సాయాన్ని అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, బూత్ కన్వీనర్ మాలిక్ పాల్గొన్నారు.





వేడుకల పేరుతో అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు: సీఐ



తాడేపల్లి రూరల్: నూతన సంవత్సర వేడుకల పేరుతో రోడ్లపై గుంపులు గుంపులుగా తిరుగుతూ అల్లర్లకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మంగళగిరి అర్బన్ సీఐ మల్లికార్జునరావు ఆదివారం హెచ్చరించారు. బైక్‌లకు సైలెన్సర్లు తీసివేసి నడిపినా, త్రిబుల్ రైడింగ్ చేసినా చర్యలు తీసుకుంటామని తెలిపారు. బార్లు, మద్యం దుకాణాలు, ఎక్సైజ్ శాఖ నిబంధనలకు అనుగుణంగా తెరచి ఉంచాలని సూచించారు. నియోజకవర్గ ప్రజలకు ఆయన నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. కుటుంబ సమేతంగా ఇళ్లలో నూతన సంవత్సర వేడుకల్ని ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.

ప్రజలకు అసౌకర్యం కలిగిస్తే చర్యలు

ఫిరంగిపురం: నూతన సంవత్సర వేడుకల్ని ప్రజలకు అసౌకర్యం కలిగించకుండా నిర్వహించుకోవాలని ఎస్ఐ చల్లా కిశోర్ ఆదివారం తెలిపారు. అతిగా మద్యం తాగి వాహనాలు నడపడం, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అతి వేగంగా మోటారు సైకిళ్లపై తిరిగే వారిపై, శబ్ద కాలుష్యం చేసే వారిపై మోటారు వాహనాల చట్టం ప్రకారం కేసు నమోదు చేస్తామని తెలిపారు. హోటల్స్ నిర్వహణకు పోలీసుల అనుమతి తీసుకోవాలని ఆయన సూచించారు.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

తాడికొండ: మండల కేంద్రమైన తాడికొండలో శంకర కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. బండ్ల కోటేశ్వరరావు మిత్ర మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ మమ్మిత్ సింగ్ ఆధ్వర్యంలో పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించారు. 92 మందికి శుక్లాల ఆపరేషన్ చేసేందుకు గుర్తించారు. ప్రత్యేక బస్సులో వారిని సోమవారం శంకర కంటి ఆసుపత్రికి తరలించి శస్త్ర చికిత్సలు చేయించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహక కమిటీ సభ్యులు కాశింశెట్టి పున్నారావు, చింతల భాస్కరరావు, యోహాను, షేక్ రఫీ, ధనేకుల హరిబాబు, పెద్దబ్బాయి, నాగేశ్వరరావు, రామారావు పాల్గొన్నారు.


కంటి పరీక్షలు నిర్వహిస్తున్న శంకర కంటి ఆసుపత్రి వైద్యులు

వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నేడు నూతన సంవత్సర వేడుకలు

తాడేపల్లి రూరల్ : మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో ఆదివారం వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో పలుచోట్ల నూతన సంవత్సర వేడుకల్ని నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ నేతలు తెలిపారు. వైఎస్సార్ సీపీ మంగళగిరి ఇన్చార్జి గంజి చిరంజీవి ఆధ్వర్యంలో ఆయన నివాసం వద్ద ఉదయం 9 గంటలకు కేక్ కటింగ్ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. తాడేపల్లి పట్టణ, రూరల్ అధ్యక్షులు బుర్రముక్క వేణుగోపాలస్వామి రెడ్డి, మున్నంగి వివేకానందరెడ్డి ఆధ్వర్యంలో తాడేపల్లి నవోదయ కాలనీలోని పార్టీ కార్యాలయంలో వేడుకల్ని నిర్వహిస్తున్నట్లు నేతలు పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని వారు కోరారు.











నియోజకవర్గ ప్రజలకు సుచరిత శుభాకాంక్షలు



తాడికొండ: తాడికొండ నియోజకవర్గ ప్రజలకు మాజీ మంత్రి, తాడికొండ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎమ్మెల్యే మేకతోటి సుచరిత నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. కొత్త ఆశలు, ఆశయాలతో నూతన సంవత్సరంలోకి అడుగుపెడుతున్న నియోజకవర్గ ప్రజలందరికీ సకల శుభాలు, సంతోషాలు కలగాలని ఆమె ఆకాంక్షించారు.











ముస్లింలపై టీడీపీది కపట ప్రేమ

మైనార్టీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని

తాడేపల్లి రూరల్: ముస్లింలపై తెలుగుదేశం పార్టీ కపట ప్రేమ చూపిస్తోందని వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని విమర్శించారు. దుగ్గిరాలలోని ముర్తుజానగర్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాబోయే టీడీపీ ప్రభుత్వంలో ముస్లింల అభివృద్ధి కోసం ప్రత్యేక బడ్జెట్‌తో పాటు రాజకీయంగా అధిక ప్రాధాన్యత ఇస్తానని చంద్రబాబు నాయుడు ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందని తెలిపారు. ఆయన పాలనలో ముస్లింల అభివృద్ధికి రూ. 2 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేశారని, మంత్రి వర్గంలో కనీసం ఒక్కరికీ కూడా చంద్రబాబు అవకాశం ఇవ్వలేదని విమర్శించారు. ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి డెప్యూటీ సీఎంతో పాటు అనేక నామినేటెడ్ పదవుల్లోనూ రాజకీయ ప్రాధాన్యత కల్పించారని తెలిపారు. సమావేశంలో మైనార్టీ నేతలు షేక్ రషీద్, పఠాన్ మస్తాన్ వలి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న షేక్ సుభాని

అనాథాశ్రమంలో చిన్నారులకు బిస్కెట్లు, చాక్లెట్ల పంపిణీ



అనాథాశ్రమంలో పిల్లలతో శాంతమూర్తి

గుంటూరు ఎడ్యుకేషన్: తాడేపల్లి మండలం వడ్డేశ్వరంలోని అనాథాశ్రమంలో ఆదివారం గుంటూరు నగరంలోని అమరావతి రోడ్డుకు చెందిన వైఎస్సార్ ఇంటిలెక్చ్యువల్ ఫోరం వ్యవస్థాపకుడు జి. శాంతమూర్తి ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకల్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమంలో చిన్నారులకు బిస్కెట్ ప్యాకెట్లు, చాక్లెట్లను పంపిణీ చేశారు. కల్మషం లేని పిల్లల మధ్య నూతన సంవత్సర వేడుకలను జరుపుకోవడం ఆనందంగా ఉందని ఆయన పేర్కొన్నారు.

నేటి నుంచి సంక్రాంతి సంబరాలు

నెహ్రూనగర్: అయిశెట్టి సీతారామయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం నుంచి స్థానిక నెహ్రూనగర్ 6వ లైనులో సంక్రాంతి సంబరాల్ని నిర్వహించనున్నట్లు చైర్మన్ అయిశెట్టి శ్రీనివాస్, 56వ డివిజన్ కార్పొరేటర్ అయిశెట్టి కనకదుర్గ తెలియజేశారు. ఆ రోజు ఉదయం 5.30గంటలకు శ్రీలక్ష్మీ నారాయణస్వామి అఖండ స్థాపన, నిత్య పూజలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. 16వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలియజేశారు.





యువకుడి ఉసురు తీసిన పొగమంచు



ఆనందకుమార్ మృతదేహం

తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని 16వ నంబర్ జాతీయ రహదారిపై వెంకటరెడ్డి పాలెం వద్ద పొగ మంచు కారణంగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు ఆదివారం అక్కడికక్కడే మృతి చెందాడు. మంగళగిరి యస్ఐ క్రాంతి కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... విజయవాడలో నివసించే సోమరాజు ఆనందకుమార్(21) కొండపల్లి పూల మార్కెట్‌లో పని చేస్తున్నాడు. శనివారం రాత్రి పని మీద గుంటూరు వెళ్లి తిరిగి వస్తున్న సమయంలో కాజా టోల్‌గేట్ దాటిన తరువాత వెంకటరెడ్డి పాలెం వద్ద మంచు కారణంగా డివైడర్‌ను ఢీకొని రోడ్డుపై పడిపోయాడు. ఈ ప్రమాదంలో ఆనంద్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. బాబాయ్ శివయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు యస్ఐ క్రాంతికుమార్ తెలిపారు.

కార్మెల్ మాతకు భక్తుల మొక్కులు

ఫిరంగిపురం: స్థానిక కార్మెల్ కొండపై కార్మెల్ మాతను దర్శించుకునేందుకు పలు ప్రాంతాల నుంచి భక్తులు ఆదివారం తరలివచ్చారు. కొండ ఎక్కి తలనీలాలు సమర్పించారు. కార్మెల్ మాతను దర్శించుకొన్నారు. అనంతరం కొవ్వొత్తులు వెలిగించి, కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు.

కనుల పండువగా రాములోరి పట్టాభిషేకం

పాత గుంటూరు: సంపత్ నగర్ శ్రీ రామనామక్షేత్రంలో 97వ శ్రీ రామ కోటి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం శ్రీ సీతారాముల సామ్రాజ్య పట్టాభిషేకం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు క్రోసూరి మురళీ కృష్ణమాచార్యులు నిర్వహణలో హోమం, విష్వక్సేన ఆరాధన, 108 కలశాలతో అభిషేకం, పంచామృతాలతో తిరుమంజన సేవ వైభవంగా నిర్వహించారు. ట్రస్టీలు లీలాసుందరి మస్తాన్‌రావు ఆధ్వర్యంలో క్షేత్రం గౌరవాధ్యక్షులు పోలిశెట్టి హరిప్రసాద్, దాతలు, అతిథుల్ని సత్కరించారు. అనంతరం శ్రీ రామచంద్రునికి కిరీట ధారణ, పుష్పాభిషేకంతో పాటు పట్టాభిషేక మహోత్సవం కన్నుల పండువగా జరిగింది. అనంతరం భక్తులకు విశేష అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. కార్యక్రమాల్ని ఆలయ కార్యవర్గ సభ్యులు పర్యవేక్షించారు.

విశ్రాంత పోలీస్ అధికారుల సంక్షేమానికి కృషి



నగరంపాలెం: విశ్రాంత పోలీస్ అధికారుల సంక్షేమం కోసం కృషి చేస్తామని ఏపీ రిటైర్డు పోలీస్ ఆఫీసర్ల అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, రిటైర్డు ఏఎస్పీ కాళహస్తి సత్యనారాయణ అన్నారు. బృందావన్ గార్డెన్స్‌లోని నంది ఇన్వెస్టిగేషన్, సెక్యూరిటీ సర్వీసెస్ కార్యాలయంలో ఆదివారం అసోసియేషన్ కార్యవర్గం సమావేశం నిర్వహించారు. అసోసియేషన్ ఉపాధ్యక్షుడు, రిటైర్డు ఐజీపీ ఎం.రవిచంద్ర మాట్లాడుతూ త్వరలో సాధారణ సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసి, సభ్యులకు పూర్తి సహాయ, సహకారాలు అందిస్తామని చెప్పారు. అనంతరం అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు, రిటైర్డు ఏఎస్పీ వెల్లంకి లక్ష్మీనారాయణను సత్కరించారు. సమావేశంలో కె.వి.నారాయణ, ఎం.మాణిక్యాలరావు, డి.వి. సుబ్బారెడ్డి, ఎస్.కృష్ణ పాల్గొన్నారు.









వృద్ధులు, అనాథలకు దుప్పట్ల పంపిణీ

గుంటూరు మెడికల్: స్కోప్ ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ డి. కొండలరావు ఆధ్వర్యంలో ఆదివారం గుంటూరు జీజీహెచ్ సమీపంలో అనాథలకు, వృద్ధులకు క్షవరంతో పాటు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ మాట్లాడుతూ స్కోప్ ఫౌండేషన్ సేవా కార్యక్రమాల్ని అభినందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు మద్దు ప్రేమజ్యోతిబాబు, రిజిస్ట్రేషన్ శాఖ రిటైర్డ్ ఐజీ యస్. బాలస్వామి, డాక్టర్ చంద్ర, రైల్వే ఎస్ఐ రమేష్, విద్యాశాఖ అధికారి ఖాసిం, గోవిందు, కందుల దీనమణి, రాజు, శ్రీను, శంకర్ పాల్గొన్నారు.















సామాజిక స్పృహ, స్నేహ భావంతో మెలగాలి


నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తున్న అవగాహన సంస్థ సభ్యులు

లక్ష్మీపురం: కొత్త సంవత్సరంలో నగర ప్రజలంతా సామాజిక స్పృహతో, స్నేహ భావంతో మెలగాలని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి సూచించారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత సంవత్సరం తాలూకూ చేదు అనుభవాలు, నిరాశజనక ఫలితాలకు స్వస్తి చెప్పాలని నగర ప్రజలకు తెలిపారు. కొంగొత్త ఆశలతో, ఆకాంక్షలతో, ఆశావాద దృక్పథంతో, సరికొత్త లక్ష్యాలతో నూతన సంవత్సరానికి స్వాగతం పలకాలని చెప్పారు. అనంతరం నగర ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు . కార్యక్రమంలో విశ్రాంత ప్రిన్సిపాల్ ముప్పాళ్ల ప్రసాదరావు, విశ్రాంత ఎక్సైజ్ అధికారి పి.భావన్నారాయణ, ఎ. హరి పాల్గొన్నారు.













ధర్మానికీ, అధర్మానికీ మధ్య యుద్ధం

- రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని
- దుష్టచతుష్టయంతో మన పోరాటం
- గుంటూరు వెస్ట్‌లో రికార్డు విజయం ఖాయం
- తొలి బీసీ మహిళగా జగనన్న నన్ను పంపారు
- పార్టీ కార్యకర్తల మద్దతు ఎప్పటికీ మరువలేనిది
- కార్యకర్తలకు నిరంతరం అందుబాటులో ఉంటా


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రజిని. వేదికపై ఎమ్మెల్యే గిరి, లాలుపురం రాము

పట్నంబజారు: రానున్న ఎన్నికలు ధర్మం, అధర్మానికి మధ్య జరుగుతున్న యుద్ధమని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త విడదల రజిని తెలిపారు. కొరిటెపాడు ప్రధాన రహదారిలోని వైఎస్సార్ సీపీ పశ్చిమ కార్యాలయంలో ఆదివారం 37, 38, 42, 43 డివిజన్లకు సంబంధించిన కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌చార్జీలు, ముఖ్యనేతల సమావేశం నిర్వహించారు. మంత్రితోపాటు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, జీడీసీసీ బ్యాంకు చైర్మన్, పశ్చిమ నియోజకవర్గ పరిశీలకుడు రాతంశెట్టి సీతారామాంజనేయులు (లాలుపురం రాము) హాజరైయ్యారు. ఈ సందర్భంగా మంత్రి విడదల రజిని మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు గెలుపు కోసం దత్తపుత్రుడు, దుష్టచతుష్టయాన్ని నమ్ముకుంటే... జగనన్న ప్రజల్ని మాత్రమే నమ్ముకున్నారని తెలిపారు. గుంటూరు వెస్ట్ నియోజకవర్గం చరిత్రలో తొలిసారి ఒక బీసీ మహిళను ఎన్నికల బరిలో జగనన్న నిలిపారని, పార్టీ కార్యకర్తలు, ప్రజలు గెలిపించుకొస్తారనే నమ్మకంతో తనను ఇక్కడకు పంపారని స్పష్టం చేశారు. జగనన్న ఆశీస్సులతో పశ్చిమ నియోజకవర్గానికి వచ్చిన తనపై ఇక్కడి కార్యకర్తలు, నాయకులు చూపుతున్న ప్రేమాభిమానాలు ఎంతో సంతోషాన్నిస్తున్నాయని చెప్పారు. పార్టీ గెలుపు కోసం ఎందాకైనా కష్టపడి పనిచేస్తానని తెలిపారు. జగనన్న నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలిపారు.

కష్టపడి పనిచేసే ప్రతి ఒక్కరికీ గుర్తింపు

వచ్చే ఎన్నికల్లో కష్టపడిపని చేసే ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు, గౌరవం దక్కేలా చూసే బాధ్యత తను తాను తీసుకుంటానని మంత్రి రజిని భరోసానిచ్చారు. ప్రతి ఒక్కరికీ అన్ని వేళలా అందుబాటులో ఉంటానని, ఎవరికి ఏకష్టం వచ్చినా, నష్టం వచ్చినా తనను సంప్రదించాలని సూచించారు. వచ్చే ఎన్నికల్లో గెలుపు అవకాశాలను ప్రభావితం చేసే అంశాల్లో ఓటర్ల జాబితా కూడా ఒకటని తెలిపారు. ప్రతి బూత్ కన్వీనర్ ఓటర్ల జాబితాలో అవకతవకలపై అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. త్వరలోనే డివిజన్ల వారీగా సమావేశాలు, పర్యటనలు నిర్వహిస్తానని, అందుకు తగినట్లుగా ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు. గుంటూరు వెస్ట్ పరిధిలోని ముఖ్యమైన అభివృద్ధి అంశాలను ముందుకు తీసుకెళ్లే బాధ్యత తాను తీసుకుంటున్నానన్నారు. సోమవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని వైభవంగా ప్రారంభించబోతున్నామని, కార్యకర్తలంతా తరలిరావాలని కోరారు.

పార్టీ బలంగా ఉంది: ఎమ్మెల్యే మద్దాలి గిరి

పశ్చిమ నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అత్యంత బలంగా ఉందని ఎమ్మెల్యే మద్దాళి గిరి తెలిపారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ జెండాను ఎగురేయడమే ధ్యేయంగా కలసికట్టుగా అంతా పనిచేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. నియోజకవర్గ పరిశీలకుడు లాలుపురం రాము మాట్లాడుతూ పశ్చిమంలో వైఎస్సార్ సీపీ జెండా రెపరెపలాడటం తథ్యమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు ఆనం సంజీవరెడ్డి, బండ్లమూడి రోజారాణి, బోగీసం శిరీష, ప్రసాద్, చల్లా శేషిరెడ్డి, సతీష్ రెడ్డి, కరుణాకర్ రెడ్డి, బత్తుల దేవానంద్, గనికే ఝాన్సీరాణి, నల్లమేకల రవీంద్ర, ఆయా డివిజన్ల సచివాలయ కన్వీనర్లు, బూత్ ఏజెంట్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలి



గుంటూరు ఎడ్యుకేషన్: నూతన సంవత్సరంలో శాస్త్రీయ దృక్పథాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలని ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు పేర్కొన్నారు. ఆదివారం బ్రాడీపేటలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో జన విజ్ఞాన వేదిక నూతన సంవత్సర కేలండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా ప్రజల్ని చైతన్యపర్చే కార్యక్రమాలతో పాటు లౌకిక వాదాన్ని ప్రచారం సాగించాలని సూచించారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కుర్రా రామారావు మాట్లాడుతూ నూతన సంవత్సరం పేరుతో యువతరం విచ్చలవిడిగా తిరగడం మానుకుని, మద్యపానానికి దూరంగా ఉండాలని తెలిపారు. మద్య నియంత్రణకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో జేవీవీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల టి.జాన్‌బాబు, బి. ప్రసాద్, డాక్టర్ ఏ. సత్యనారాయణ ప్రసాద్, జి. వెంకటరావు, బి. శంకర్‌సింగ్, బి. ఉదయ్‌భాస్కర్, ఎం. బోసుబాబు, కేవీఎస్ దుర్గాప్రసాద్, అక్షయ పాల్గొన్నారు.

బోధనలో కాలానుగుణ మార్పులను ఆహ్వానించాలి

ప్రభుత్వ పరీక్షల విభాగ డైరెక్టర్ దేవానందరెడ్డి


మాట్లాడుతున్న దేవానందరెడ్డి

గుంటూరు ఎడ్యుకేషన్: బోధనలో కాలానుగుణమైన మార్పుల్ని ప్రవేశపెట్టడంతో పాటు విద్యార్థుల్లో నైపుణ్యాల్ని వెలికి తీయాలని రాష్ట్ర ప్రభుత్వ పరీక్షల విభాగ డైరెక్టర్ డి.దేవానందరెడ్డి సూచించారు. ఆదివారం అమరావతిరోడ్డులోని నవీన హైస్కూలు 44వ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న దేవానందరెడ్డి మాట్లాడుతూ బోధనా పద్ధతుల్లో చోటు చేసుకుంటున్న వినూత్నమైన మార్పులకు అనుగుణంగా విద్యార్థులకు ఆంగ్ల భాషా పరిజ్ఞానంతో పాటు కంప్యూటర్, క్రీడా, సాంస్కృతిక అంశాల్లో ప్రాధాన్యత ఇవ్వాలని ఉపాధ్యాయులకు సూచించారు. నవీన విద్యాసంస్థల చైర్మన్ ఏరువ చిన్నపరెడ్డి మాట్లాడుతూ బోధనలో రాజీ పడకుండా విద్యార్థుల సమగ్ర వికాసానికి దశాబ్దాలుగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా గత విద్యా సంవత్సరంలో పదో తరగతి పరీక్షల్లో 500 పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు వెండి పతకాల్ని బహూకరించారు. అనంతనం విద్యార్థినీ, విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు. కార్యక్రమంలో పాఠశాల కో–చైర్మన్ వై.చిన్నమ్మ, ప్రధానోపాధ్యాయులు వై.నవీన్‌రెడ్డి మాధవి, ఆనందరెడ్డి సునీత, అంజిరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పాత గొడవల నేపథ్యంలో వ్యక్తిపై దాడి

గుంటూరు ఈస్ట్: పాత గొడవల నేపథ్యంలో వ్యక్తిపై దాడి చేసిన ఘటనపై నగరపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. మిర్చి యార్డు సమీపంలో నివసించే శేఖర్ పాత గొడవల నేపథ్యంలో మస్తాన్‌వలికి ఫోన్ చేసి పిలిపించాడు. ఐరన్ రాడ్‌తో తలపై పలుమార్లు మోది గాయపరిచాడు. అనంతరం కత్తితో దాడి చేసి గాయపరిచాడు. మస్తాన్‌వలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళను దూషించిన వ్యక్తిపై కేసు

మహిళను దూషిస్తూ ఓ వ్యక్తి మేసేజ్‌లు పెట్టిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. కంకరగుంట గేటు సమీపంలో నివసించే ఓ మహిళకు పాత కక్షల నేపథ్యంలో గుంటూరు సురేష్ బూతులు తిడుతూ సెల్‌లో మేసేజ్‌లు పెట్టాడు. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సిస్టర్ రోజ్‌లిన్‌కు డాక్టరేట్



గుంటూరు ఎడ్యుకేషన్: ఎడ్యుకేషన్ విభాగంలో చేసిన పరిశోధనకు గాను సాంబశివపేటలోని సెయింట్ జోసఫ్ బీఈడీ కళాశాల పరిపాలనాధికారి సిస్టర్ ఏ.రోజ్‌లిన్‌కు ఏఎన్‌యూ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఏఎన్‌యూ బోర్డు ఆఫ్ స్టడీస్ ఇన్ ఎడ్యుకేషన్ చైర్‌పర్సన్ డాక్టర్ జేఆర్ ప్రియదర్శిని పర్యవేక్షణలో ''కౌమారుల ఆరోగ్య క్షేమాభివృద్ధిలో యోగా, వ్యాయామాల ప్రభావం'' అనే అంశంపై చేసిన పరిశోధనకు గాను ఆమె డాక్టరేట్ అందుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ సిస్టర్ తేరేజమ్మ, ప్రిన్సిపాల్ డాక్టర్ టి. స్వరూపరాణి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది డాక్టర్ రోజ్‌లిన్‌కు అభినందనలు తెలియజేశారు.

అనాథాశ్రమంలో చిన్నారులకు బిస్కెట్లు, చాక్లెట్ల పంపిణీ

గుంటూరు ఎడ్యుకేషన్: తాడేపల్లి మండలం వడ్డేశ్వరంలోని అనాథాశ్రమంలో ఆదివారం గుంటూరు నగరంలోని అమరావతి రోడ్డుకు చెందిన వైఎస్సార్ ఇంటిలెక్చ్యువల్ ఫోరం వ్యవస్థాపకుడు జి. శాంతమూర్తి ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకల్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమంలో చిన్నారులకు బిస్కెట్ ప్యాకెట్లు, చాక్లెట్లను పంపిణీ చేశారు. కల్మషం లేని పిల్లల మధ్య నూతన సంవత్సర వేడుకలను జరుపుకోవడం ఆనందంగా ఉందని ఆయన పేర్కొన్నారు.



